కల్పలత

చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాద్ గారు బి.ఏ

౧

నగలు లేనంతమాత్రమున ఆమెకు చక్కదనం లేదనటానికి వీలులేదు. పక్కపాపిడి, వెంట్రుక నొక్కు, వెగటుగానుండు వెట్టికత్తిరింపులు లేవు. పుట్టినది పూరింటిలోనైనా రమ్యహర్మ్యాలలోనున్న రమణీమణులకన్నా ఆమె ఏమాత్రం తీసిపోదు. తెల్ల చీరె, మెడలో విరజాజిమాల, పెదవిపై లేనగవు ఆమెకు విలువగల నగలు. ఎక్కడో సముద్రాల్లో నాచుచిప్పలలో పుట్టిన ముత్యాలవలె, అరణ్యాల్లో ముళ్ళపొదలమాటున పెరిగిన చందనపుచెట్లవలె ఆమె లేమిగల కుటుంబములో పుట్టినా గౌరవింపదగినదే. ఆమె ఎంతచక్కనిదో అంతగుణవతి, ఎంతగుణవతో అంతవిద్యావతి. పలుకుల్లో మార్దవం, పనుల్లో నేర్పు ఆమెకు పుట్టుకతోనే పుట్టినవి. ఆమె చిన్నతనంలోనే తల్లిని గోల్పోయింది. ఆమె అవివాహిత.

అతడు రూపవంతులలో రూపవంతుడు. అతని వదన మెంతసుందరమో హృదయమంత నిర్మలము. ఆనందతరంగాలలో, అమృతమయమైన తలంపులలో విహరించే అతనికి ఈప్రపంచమంతా నందనవనంగా కనిపిస్తుంది. నీటిఅలలు, గాలితరగలు, పుప్పొడిదుమారములు, మబ్బుపొరలు అతనికి వింత సందేశాలు తెచ్చేదూతలు. అదృష్టవశాత్తు అతడు ధనంగలకుటుంబములో పుట్టేడు; దానితో బంగారానికి తావి అబ్బినట్లయిపోయింది. అతడు బ్రహ్మచారి.

* * *

ఆమె కల్పలత, అతడు మోహనుడు. ఒకే గ్రామవాసులు. అయితే మోహనుడు నివసించునది రమ్యహర్మ్యము, కల్పలత నివసించునది పూరిగుడిసె. రెంటికి ఇరువదిగజాలదూరము.' కల్పలత తనకొరకే జన్మించినదని మోహనునిఅభిప్రాయం. మోహనుడు తనకొరకే జన్మించినాడని కల్పలతఅభిప్రాయం. చిన్ననాటనుండి వారు ఆటలలో కలసిమెలసి కాలంవెళ్ళదీసేవారు. కల్పలత తినడానికి తెచ్చుకొనినదానిలో కల్పలతకు పెద్దభాగం. కల్పలత బీదపిల్ల అయినా ఏవో పూలతో అలంకరించుకుంటే ఆనాడు మోహనుడు మురిసిపోయేవాడు. ఎట్టిఆశ లేదు. కారణంలేదు. పట్టుదలలేదు. ఒకరినొకరు ఎందుకో అమితంగా ప్రేమించేవారు. ఎందరు పిల్లలులేరు! ఎందరు తమతోకలసి ఆడుకోవడంలేదు! కాని కల్పలతా మోహనులకున్న మైత్రి ఎవరికీలేదు. దీనికి కారణం ఎవరు చెప్పగలుగుదురు? సూదంటురాయి ఇనుమునే ఎందుకు ఆకర్షించాలి?

౨

కొన్నిసంవత్సరాలు దాటినవి......ఆనాడు సంక్రాంతి. ఉన్నఅమ్మలు ఉన్నట్లుగా నగలు అలంకరించుకొని పేరంటానికి బయలుదేరారు సాయంత్రం కాగానే. నగరమంతా తోరణాలతో, ముగ్గులతో అందంగా ఉన్నది. ఇంటికివచ్చినకొత్తఅల్లుండ్లకు చేయగలమర్యాదలు చేస్తున్నారు ఆడపిల్లలనుగన్న అయ్యలంతా. ఏవైపుజూచినా కొత్తబట్టలగుమగుమాయింపులు.

ఇంతవేడుకగానున్నా గ్రామానికి కొంచెం వెలుపలగానున్న ఆపూరిగుడిసెముందరనున్న అవిసెచెట్ల క్రింద నులకమంచముమీాద విచారంగా కూర్చునియున్నది కల్పలత. అంచువెలసిపోయిన ఆతెల్లచీరె, నగలులేనిఆబోసిమెడ, లేనవ్వుఐనాలేని ఆఎఱ్ఱని పెదవి ఒకవిధంగా అందంగానేఉన్నవి. పిల్లగాలికి తలమీది వెంట్రుకలు ఒకటొక్కటి ముఖంమీద వాల్తున్నవి. ఒకేదృష్టితో ఆమె ఆచెట్లవైపు చూస్తున్నది. లోకమంతా తనవంటిదే అనుకున్నదికాబోలు. అస్తిరమైన ధనంకోసం ప్రణయబంధాలను పటాపంచలొనరించే పాపాత్ములు లోకంలో లేరనిగాబోలు ఆమెఅభిప్రాయము. తనకుమల్లే పిచ్చిఆదరంతో లోకాన్ని నమ్మి మనసులో మర్మంలేకుండా అందరూ సంచ

రిస్తారని ఆమె తలచిఉంటుంది. తమసుఖంకోసం లోకులప్రాణాలనుసైతం నీరాజనంపట్టే క్రూరులు లోకంలో ఉన్నారని ఆమె అనుకోలేదు. మల్లెపువ్వులాగాపుట్టి, కన్నులువిప్పి, కమ్మతావులు జిమ్మి, తుదకు కన్నుమూసి మన్నుగరపదలచినది ఆమె. కాని జీవిత మంతప్రశాంతంగా ఎల్లాగడుస్తుంది!... చిన్ననాటనుండి తనహృదయంలో ఎన్నోకోరికలు రేపి, తన ప్రేమసుధనంతా దొంగిలించి, తన్నే నమ్మియుండమని ఎన్నోసార్లు అభయమిచ్చిన మనోహరుడు, తనహృదయాధినాథుడు అగుమోహనుడు పెద్ద కట్నానికి ప్రేమ తెచ్చిపెట్టికొని వేరొక బాలికను పెండ్లాడనున్నాడు. వేలకొలదికట్నాలకు భార్యలకు అమ్ముడుపోయే బి. ఏ. లలో మోహనుడు కూడా చేరిపోయినాడు. పాశ్చాత్యనాగరికతాపథమునపోతూ బి. ఏ. ప్యాసయినంతమాత్రాన విజ్ఞాననిధులమని విఱ్ఱవీగుతూ, కొంపలు గుల్లలయినా లక్ష్యం లేక, అల్లారుముద్దుగాపెంచుకొనిన ఆడపిల్లను ఇచ్చినప్పటికి, వేలకొలది రూపాయలను కోరుతూ, అవి సమర్పింపశక్తిలేని మామలపాలిటి యమదూతలుగా సంచరిస్తూఉన్న ఈక్రొత్త బి. ఏ. లవలెనే మోహనుడు కట్నాలవ్యామోహంలో పడ్డాడంటే ఆశ్చర్యమేమున్నది? ఇరువైవేలరూపాయలతో కల్పలత ముఖంమీద మరుపుతెర పడిపోయింది. కల్పలతకన్నా నిన్నుప్రేమించిన బాలిక లోకంలో లేదని మోహనుని కెరుకలేకపోలేదు. కాని "ఇరువైవేలకన్నా పిలువగలదా కల్పలత?" అనే సందేహం అతనికి తోచింది. ఏలాగైతేనేమి కల్పలతను విసర్జించి వేరొకబాలికను పెండ్లాడతలచినాడు మోహనుడు. ఈవార్త కల్పలతకు తెలసిననాడే సంక్రాంతి.

చిన్నప్పటినుండి తాను నిర్మించుకున్న గాలిమేడలు నాటితో నేలమట్టమైనవి. ముందు తనజీవితమెట్లు? తానెందులకు అతనిని ప్రేమించెనో ఆమె కెరుకలేదు. ప్రపంచంలో ఏదో ఒకకారణాన్ని మనసులో పెట్టుకొని ఒకవ్యక్తి వేరొకవ్యక్తిని ప్రేమిస్తే అది నిజమైన ప్రేమ అనిపించుకొనదు. ఏ కారణం లేకుండా, తనకు తెలియకుండా ఒకవ్యక్తి వేరొకవ్యక్తిని ప్రేమించినట్లయితే అదే 'నిజమైనప్రేమ' అనుమాట కర్థం. కల్పలత ముందుకాలమునందైన మోహనుని ప్రేమించకుండ జీవింపలేదు. ఎవనికి తనహృదయమును పిన్ననాటనే అర్పించెనో, పెరిగి పెద్దయైనప్పటికి ఆమె అతనికే దాని నర్పింపదలచెను. అవిదితమును, అనంతమును, అలభ్యమును అగు పవిత్రప్రణయసాగరమున తన కాశ్రయమిచ్చునది మోహనుడే అని ఆమె ఇదివరలో నమ్మియుండెను. ఇపుడును అట్లే నమ్ముచున్నది. ముందును అట్లే నమ్మకముంచదలచినది. తాను పేదరాలైనను ధనికుడును, విద్యావంతుడును, రూపవంతుడును అగు మోహనుడే తన ప్రాణవిభుడని అనుకొనుటకు తనకు హక్కుగలదని ఆమె తలచెను. ఇది పిచ్చితలంపు కాదుగద!

3

మోహనుకు వివాహంజరిగినతరువాత బంధువులందరితో గృహప్రవేశానికి స్వగ్రామం వచ్చాడు. ఊరివారినందరిని పేరంటానికి పిలిచేరు. ఆవూరి ఇంటిముందు "పేరంటానికి రావలసిందని" పెండ్లివారి ఆడబడుచు కల్పలతకు బొట్టుపెట్టినపుడు కల్పలత లేనవ్వుతో తలవంచుకుని 'సరే' అన్నది.

సూర్యుడస్తమించక పూర్వమే తలదువ్వుకొని తనకున్న తెల్లచీరె కట్టుకొని పెండ్లివారింటికి పేరంటానికి బయలుదేరింది కల్పలత. ఇంటినిండా జనం గుంపులుగానున్నారు. మోహనుడు, ఆతని భార్య మధ్య పీటమీద కూర్చునిఉన్నారు. మంత్రాలు చదువుతున్నారు బ్రాహ్మణులంతా. అక్కడున్న ఆడవారిలో కొంచెం చాటుగానుంచుని చూస్తున్నది కల్పలత. ఇంతలో పూజచేస్తున్న మోహనుడు తలకొంచెం ఎత్తి నాల్గువైపులా చూసేడు. తటాలున అతనిదేహం కంపించినది. ఎప్పటిరోజులో జ్ఞాపకం వచ్చినవి. కల్పలతకనులు నిలకడగాలేవు. ఆకనులు, మోహనుని కనులు క్షణంసేపు నిలచిపోయినవి. జరిగిపోయిన వింతకథ జరుగుచున్న వింతచరిత్ర ఒక్కక్షణ

కాలంలో సినీమా బొమ్మలులాగా కనుపించినై. మోహనుడు తలవంచేడు. కల్పలత వెళ్ళిపోయింది.

* * *

చిట్టచిటారుకొమ్మనున్న ఒక గులాబీపువ్వులోని రేకులురెండు గాలితాకున మెల్లగా రాలిపోయినవి. అవి తిరిగి పువ్వులోనికి చేరగలవా? చేరినా పొందికగా నిలువగలవా? నిలచినా కమ్మతావుల జిమ్మగలవా?

* * *

కల్పలత కాదినం చాలాపవిత్రమైనది. మోహనుని దయగలచూపుల కామె ఆనందంచేత లోకాన్నే మరచిపోయింది. తన జీవితం ధన్యమైనదని తలచింది. ఇల్లు అలికినంతనే పండుగ అనుకునే అమాయకురాలు కల్పలత. ఎప్పటికి మోహనుడు తన ప్రాణవిభుడేనని ఆమెదృఢనమ్మకం. అట్లా అనుకున్నంతసేపు ఆమెకు తరుగనిసంతోషం.

౪

కాలం చాలాగడచింది. మోహనుడు బి. ఏ. అని ఇదివరకే మనకెరుక. ఏసర్వీసుకమీషను మెంబరును ఆశ్రయించాడో, ప్రొబేషనరీ డిప్యూటీతహసిల్దారుగా నియమింపబడ్డాడు. ఇంటకావలసినంత ధనమున్నది, విద్యఉన్నది, సౌందర్యమున్నది, మీదు మిక్కిలి పెద్దఉద్యోగమైనది—కలిసివచ్చే రోజులుంటే అట్లా ఒకటివెంటఒకటి అనుకోకుండా వచ్చిచేరటం సహజం. తహసిల్దారుఉద్యోగమైన రెండుమాసాలకే భార్యయగు విమల కాపరానికి వచ్చింది.

సుఖాలువచ్చినా అట్లావస్తవి. కష్టాలువచ్చినా అంతే. ఎన్నిదినములనుండో నమ్మియున్న మోహనుడు నట్టేటముంచాడు, ఈతీరనిదుఃఖంలో ఉండగనే తండ్రి గతించాడు, తాను అబల, అవివాహిత, ఇంట పెద్దలు లేరు, అయిన వాండ్లు దూరపుజిల్లాలో ఉన్నారు. ఏమి చేయగలదు కల్పలత? పరాత్పరునిపై భారమువేసి ఆపూరికొంపలోనే కాలం వెళ్ళదీయతలచింది. ఆమె మంచంలో పరుండి ఆకాశంవైపు తలద్రిప్పి ఆలోచనలో మునిగినంతనే ఎన్నోవిషయాలువచ్చేవి మనసులోనికి...... ముందు తనజీవిత మెట్లుకానున్నదో...తానుపొట్టకై ఎన్నిఇబ్బందులుపడవలెనో అని ఆమె భయపడేది. ఇతర విషయాలనుగురించి ఎంతవిచారించినా తన వివాహవిషయం ఆమె ఎప్పుడూతలచేదికాదు. మోహనునే ఆమె ప్రేమించింది. ఈనాటికి అతడు అందని పండైనాడు. అట్లా అయినప్పటికి మనసులోనైనా తాను మోహనునిభార్య ననుకునేది.

౫

అది వేసవికాలము. వేడిగాలి చాల ఎక్కువగానే ఉన్నది. బాటసారులు చలివేంద్రలవద్ద గుంపులు గుంపులుగా చేరారు. ముక్కాలు తెరచుకొని కాకులు చెట్లకొమ్మలలో కూర్చున్నై. అప్పుడప్పుడు గొడుగు, చెప్పులు వేసుకొని బజారులో ఎవరోఒకరు వెళ్తూనే ఉన్నారు. సోడాబుడ్లచప్పుడు వినబడుతూనే ఉన్నది. అంతవేడిగానున్నా తహసిల్దారుకచేరీవద్ద జనులు గుంపులుగాఉన్నారు. ఇంతలో ఒకమోటారుబస్సువచ్చి అక్కడ నిలచింది. దానిలోనుండి మొద లొక పోలీసుబంట్రోతు దిగేడు. తరువాత ఖద్దరు బట్టలు కట్టుకొని, ప్రక్కన ఒక పెద్ద సంచితో ఒకపెద్దమనిషి దిగేడు. ఆయన తరువాత ఖద్దరుచీరలు కట్టుకున్న ఇద్దరుఆడవాండ్లు దిగేరు. వీరందరికి ముందువెనకా పోలీసులు కాపలాగా ఉన్నారు. కొంతసేపటికి అందరూ కచేరిలోనికి వెళ్ళారు. తహసిల్దారు మధ్యకుర్చీలో కూర్చుని ఎదో వ్రాస్తున్నాడు. పోలీసువారితో కచేరీలోనికి వచ్చిన పురుషుడు, స్త్రీలు సత్యాగ్రహములో పాల్గొని ఎరెస్టు చేయబడ్డారు. ఇవి ఆర్డినెన్సు రోజులు కాబట్టి ఆకేసు వివరాలు మనకెందుకు? సరె. విచారణ తేలికగాజరిగే కేసు కాబట్టి ఎవో అటూ ఇటూ చూస్తూ తహసిల్దారు ముద్దాయిలను తేరిపార చూచాడు......ఆచూపు అట్లే నిలచిపోయింది...

ఆముగ్గురిలో ఒకతె కల్పలత కాబట్టి, తహసిల్దారు మోహనుడు కాబట్టి, మోహనునికంటబడి ఏవిధంగానైనా అతనిచేత అగౌరవింపబడో, గౌరవింపబడో తనకోర్కె నెరవేర్చుకోనదలచింది కల్పలత. అందుకనే అతని జూరిస్‌డిక్షన్‌లో నేరంచేసి ఆతనికోర్టుకు వచ్చింది. అన్నివిధాలా తన్ను శిక్షించడానికి అతడు అధికారి అని ఆమె మనసార నమ్మింది.

కేసువిచారణ జరిగింది. అందరికి ఆరునెలలు కఠిన శిక్ష, సి. క్లాసు ఇచ్చాడు తహసిల్దారు. శిక్షవిని కల్పలత మందహాసంచేసింది. మోహనుడు కోర్టు ఆరోజుకు విరమించాడు. నేటికి కల్పలతబ్రతుకు ధన్యమైనది. ఏవిధంగా ధన్యమైనదో ఆపిచ్చిమనసుకు తప్ప ఎవరికెరుక?

౬

కాలచక్రం తిరిగిపోయింది. కల్పలత కారాగారమున ప్రవేశించిననాటనుండి మోహనునిహృదయం సరిగాలేదు. వెలువరించలేనిఆవేదన అతనిహృదయంలో ప్రవేశించింది. ఒకపనీ చేయ బుద్ధిపుట్టదు. చేసినా సానుకూలంగాదు. కల్పలతకు శిక్ష ఇంకారెండు రోజులలోపూర్తికానున్నది. ఆమెను ఒకసారి చూడవలెనని మోహనుడు ఎన్నోసార్లు అనుకున్నాడు. ఆనాటి కల్పలతయొక్క లేనవ్వు మరచిపోదామన్నా అతనికి మరపునకు రాలేదు. ఆమాటమార్దవం, ఆ ముఖముతీరు మరిమరి తలపునకువచ్చేవి.

మోహనుడు గదిలో ఏమోమో ఆలోచించుకుంటూ పడుకొని నిద్రబోయినాడు. భార్యయగు విమల ఏదో చదువుకుంటూ వసారాలో ఉన్నది. దాదాపు పగలు ఒంటిగంటదాటింది. ఇంట్లోపనిచేసేనౌకరులంతా బజారువెళ్ళారు ఎదోపనిమీద. ఇంతలో వీధితలుపు తెరువబడినది. తెలిచీర ధరించి ఒకఇరువదివత్సరముల యువతి లోనికివచ్చింది. ఆమె ముఖంచూస్తే ఒకప్పుడు సుఖం అనుభవించినదానిలాగానే ఉన్నది. ఆమె విమలను సమీపించింది. కొంతసేపటికి "అమ్మా! నేనొకనిర్భాగ్యురాలను" అని దీనంగా పలికింది.

"మీ దేగ్రామం? ఇచట కెందుకు వచ్చారు?" అని విమల ప్రశ్నించింది.

"పొట్టగడువక తమవంటివారికడ బ్రతుకు వెళ్ళబోసుకోనవలెనని వచ్చాను"అని ఆమె జవాబు చెప్పింది.

"చిన్నవయసులో ఉన్నారు. మీకింత కష్టమెందుకు వచ్చింది; మీకు తల్లిదండ్రులులేరా?"అని విమల పలికింది.

"తల్లిదండ్రులు పరలోకం చేరారు, నేను అవివాహితను. అదిగాక పెద్దకుటుంబమునకు చెందినదానను. మీకులమునకు చెందినదానను; పూర్వజన్మములోని పాపములవలన నాగతి ఇల్లాబట్టింది. మీరు గర్భవతిగానున్నారు. ఈ ఓపికలేని రోజులలో నేను మీ ఇంటనిలచి చాకిరిచేస్తాను" అని ఆమె తనసంగతి చెప్పింది.

"నాకు ఒక ఆడమనిషి చాకిరికికావలసినమాట నిజమేను. మీరు మర్యాదాకుటుంబమునకు చెందినవారంటున్నారు. ఎంతజీతంకావాలి?" అని విమల అడిగింది.

"పట్టెడన్నంతప్ప నాకేమి అక్కరలేదు. కాలంగానికాలంలో తలదాచుకోటానికి తావుజూపించారు. మీకు వేయినమస్కారాలు. మీఋణం నేను తీర్చుకోలేను" అని ఆమె కంట నీరుబెట్టింది.

"మీరు ఎల్లకాలం మాకడనే ఉంటారుకదూ" అన్నది విమల.

"నేనెక్కడికివెళ్తాను. నాకు లోకంలో ఇల్లూవాకిలీ లేదు. కాని నాదొకమనవికలదు. అది జాగ్రత్తగా ఆలకించి నాకోరిక నెరవేరిస్తే అన్నివిధాలా మిమ్ము నాతల్లిగా ఎంచుకుంటాను" అని ఆమె పలికింది.

"ఏమి కోరికె?" అన్నది విమల.

"నేను గౌరవంగల కుటుంబములో పుట్టినదానను. ఎక్కువకష్టం ఇదివరలో ఎరగను. బండచాకిరి చేయ బలంలేనిదానను. అదిగాక మీమగవారి కంటబడ కుండా ఇంట చాకిరిచేస్తాను. మగవారికిచెందిన పనులు నేను చేయజాలను. అన్నికాలములందు మీ వెంటనే యుండెదను. ఇల్లా అడిగినందుకు గర్వం గలదానినని అనుకోవద్దు. కన్నతల్లినని నమ్మి మీ అండజేరాను. అన్నివిధాలా నాప్రాణం మీచేతులలో పెట్టున్నాను' అని ఆమె ఏడ్చింది.

"నేను అంత తెలివితక్కువదానను కాను. ముఖ లక్షణాలు చూచి మీకేపని చెప్పవలసింది అప్పుడే గ్రహించాను. మగవారిఎదుటపడేపని మీరేమిచేయ నక్కరలేదు. మీ గౌరవానికి హానిరాకుండా చూస్తుంటాను"అని విమల ధైర్యంచెప్పి ఆమెను ఇంటి లోనికి తీసుకొనివెళ్లింది.

మోహనుడు నిద్రనుండి లేచినతరువాత అక్రొత్తగావచ్చినమనిషినిగురించి అతనికిచెప్పి అనుజ్ఞతీసుకొని తనకడనే చేర్చుకొనినది.

ఆ క్రొత్తగావచ్చిన యువతి అప్పుడే జైలునుండి వచ్చినకల్పలతయని చదువరులు గ్రహింపకుందురా ? కల్పలత తాను బ్రతికియున్నన్నిదినములు మోహనునికే సేవజేయదలచినది. తనశరీరమునందలి ప్రతిరక్తపుబొట్టు మోహనునిఅభివృద్ధికై ఆమె వినియోగింపదలచినది. ఏడుకొండలవానియనుగ్రహమువలన ఆమె మోహనునిగృహమునందే పనిచేయుటకు కుదిరినది. ఇట్లు తన కవకాశము చిక్కునని ఆమె కలలోనైన తలంచియుండలేదు. కాని ఈనాటికి ఆమె కోర్కె ఫలించినది.

౭

అప్పుడే సూర్యు డుదయించాడు. కళగిన సంతోషానికి ముఖము కందిపోయేటట్లు నవ్వింది తూర్పుకాంత. తాముగూడా సంతోషం పంచుకున్నామని చెట్లు అటూఇటూ తలలుద్రిప్పినై. అప్పుడే కాఫీపుచ్చుకొని మోహనుడు వసారాలో పడకకుర్చీలో పడుకొని పేపరు చదువుతున్నాడు......ఇంతలో బంట్రోతువచ్చి టెలిగ్రాము చేతికిచ్చాడు. ఆతురతతో ఆటెలిగ్రాము చించాడు:-"విమల కుమారునిగన్నది. కాని చాలజబ్బుస్థితిలోనున్నది. వెంటనే రావలయును" అని అందులోఉన్నది.

కల్పలత నౌకరికి వచ్చినపుడు విమల నిండుగర్భవతియని ఇదివరకే విన్నాము. ఆమెను పుట్టింటివారు తీసుకొనివెళ్లారు. ఆమెతో కల్పలతకూడా వెళ్లింది. కల్పలతయొక్క వినయం, పనియందునేర్పుకు విమల ఎప్పుడూ దాసీదానివలె చూడ నేలేదు. ఆ ఒకమాసముకూడా తనభర్తకంట పడకుండానే ఆమెను గౌరవంగాచూస్తూ కాలంగడిపింది. విమలాకల్పలతలు అక్కచెల్లెండ్రవలె కలసిపోయినారు. వ్యక్తీకరింపలేని ప్రేమ ఒకరిలోనొకరికి కనుపించింది. విమలలేనిదే కల్పలత వెఱ్ఱిదానివలె నుండేది. కల్పలత కనుపించనపుడు విమల విసుగుతో కాలంబుచ్చేది. ఏనాటి సంబంధమో ఇది ఎవరు చెప్పగలరు?

మోహనుడు టెలిగ్రాముచూసుకొని కారుమీద అత్తవారింటికి వచ్చేటప్పటికే విమల చనిపోయింది. ఆమెకు కలిగిన పసికందును చేతులోపెట్టుకొని అమితంగా ఏడవడం మొదలుపెట్టింది కల్పలత. ఆమె ముఖం కందిపోయింది, కనులు ఎఱ్ఱబడినవి, దేహం కృశించిపోయింది. చనిపోయేముందు విమల తన తల్లిదండ్రులనైనా పిలువకుండా కల్పలతను పిలిచి ఆమెచేతులలో పసికందునుపెట్టి నీ కుమారునివలెనే చూచుకొమ్మని నొక్కిచెప్పింది...కొన్నినిముసములు గడచినతరువాత మళ్ళీ కల్పలతను పిలచి, విమల ఆమె చెవిలో ఏమేమోచెప్పి ఒక్కసారి పెద్దపెట్టున నవ్వి ప్రాణం వదిలింది.

♦ ♦ ♦ ♦

మోహనుడు మామగారింట కాలుబెట్టినపుడు వసారాలో ఒకప్రక్క చనిపోయిన భార్యశవము

వేరొకప్రక్క కావుకావుమని ఏడుస్తున్నపిల్లవాడిని చేతపట్టుకొనియున్నకల్పలత కనుపించింది. అతడు కొంతసేపు లోకాన్నే మరచిపోయినాడు.

ఆ రోజు విమలయొక్క దహనసంస్కారాలన్నీ పూర్తిఅయ్యేటప్పటికి దాదాపు రాత్రి ఏడుగంటలు దాటినవి. మోహనుడు అలసటతో ఒకచీకటిగదిలో పొంగిపొంగి వచ్చేదుఃఖాన్ని దిగమ్రింగుతూ ఒక మంచంమీద పండుకున్నాడు. చనిపోయిన విమల, కనుపించిన కల్పలత ఆతని కనులముందు నిలచియున్నారు. కల్పలత అచ్చటికెట్లువచ్చినదని తన్నుదా ప్రశ్నించుకున్నాడు.

శిక్షవిధించిననాడు హృదయంలో లేచిన పశ్చాత్తాపతరంగ మింకా అణగిపోలేదు. ఇంతలో భార్యావియోగంకలిగింది. మీదుమిక్కిలి తాను చేతులార శిక్షించిన కల్పలత కనుపించింది. ఒకవైపు అంతులేని దుఃఖము, వేరొకవైపు మితిలేనిపరితాపము; ఒకటి చేతిలోనుండి జారిపోయినది, వేరొకటి జారిపోయి చేతజిక్కినది; ఒకటి అలభ్యము, వేరొకటి అమూల్యము. తనకు కనుపించకుండ ఈనెలరోజులనుండి విమల తనకడ దాసీగానియమించియున్నస్త్రీ కల్పలతయేనని అప్పుడు తెలుసుకున్నాడు. విమలయొక్క సౌజన్యానికి, కల్పలతయొక్క త్యాగానికి ఆశ్చెరువుపడ్డాడు. అన్నివిధాలా తానే నిర్భాగ్యుడనని అనుకున్నాడు......అట్లాగే నిద్రలో మునిగిపోయినాడు. రాత్రి రెండుగంటలైనది. పసుపుపచ్చని చీరెగట్టుకొని చేతహారతిపట్టుకొని పూలు పండ్లు పళ్ళెంలోపెట్టుకొని నవ్వుకుంటూ విమల వచ్చింది. పూలతో మోహనుని పూజించింది. వినయంగా "నేను మిమ్ము వదలి వచ్చేశాను. నాకన్న గుణసంపత్తిగలసాధ్వి, నాఅక్క అగు కల్పలతను నాస్థానంలో నియోగించాను. నాకుమారుని ఆమెకే అప్పగించాను" అనిచెప్పి వెళ్ళిపోయింది. మోహనుడు మేల్కొని తనకు వచ్చిన కలకు తానే ఆశ్చర్యపోయినాడు.

౮

అది వెన్నెలరాత్రి. నిమ్మచెట్లనీడలు నల్లగా తోటలోనున్న రాతిఅరుగుపై పడుతున్నవి. అక్కడకు సమీపంలోనున్న బంతిచెట్లవద్ద ఇద్దరు యువతీ యువకులున్నారు. సమీపంలో ఒక ఉయ్యాల తొట్టిలో రెండునెల్లపిల్లవాడు నిద్రపోతున్నాడు. అంతా నిశ్శబ్దంగాఉన్నది

"ఇది ఎట్లాఅంటానికి వీలులేదు. విమల చనిపోవటం గొప్పలోటు. ఆమెతోసహా నేను మీపాదసేవ చేయగలభాగ్యం నాకు కలుగలేదు. ఆమెను అన్యాయంగా తొలగించి భగవంతుడు నాకాస్థానం ఇచ్చాడు. అందుకు నేనెంతో దుఃఖపడుతున్నాను." అన్నది కల్పలత.

"విమల చనిపోవడం నాకొక బల్లెపుపోటువంటిది. ప్రథమంలో నిన్నువదలి, అంతతో విరమించక నీకు ఆరునెలలు కఠినశిక్ష వేసి, తుదిని నిన్నే చేపట్టినాను. ఈవిధంగా భగవంతుడు చేస్తాడని ఎవరనుకున్నారు?" అని మోహనుడన్నాడు.

"నమ్మాటికి నేను విమలను మరువలేను. చనిపోయేటప్పుడు ఆమె నాకు చెప్పినపలుకు ఇంకా చెవిలో మ్రోగుతునే ఉన్నది. ఒక విధంగా నేను ధన్యురాలను, వేరొక విధంగా పరమనిర్భాగ్యురాలను." అని కల్పలత కంటనీరు పెట్టింది.

ఇంతలో ఉయ్యాలలోపరుండియున్నపిల్లవాడు నిద్రలేచి ఏడవటం మొదలుపెట్టేడు. ఇద్దరూ ఆవైపునకే పరుగెత్తారు.